కథా నిలయం
శ్రీకాకుళం

# రాజీ

మాధవరావు సుశీల మెళ్ళో తాళికట్టేనాటికి సువర్చల పోయి ఆరునెలలయింది. సువర్చల అతని మొదటి భార్య రెండు సంవత్సరాల క్రితం జరిగిన పెళ్ళి - ఏణ్ణార్ధం కాపురంతో సువర్చల అతని జీవితం నుండి శాశ్వతంగా దూరమైంది. ఆ రోజు సుశీలని వివాహం చేసుకొంటూ మాధవరావు ఒకటే అనుకున్నాడు; సువర్చలని పదే పదే తల్చుకుంటూ సుశీలను బాధ పెట్టకూడదు అని. పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. ఆడ పెళ్ళివారికి సరదాలువున్నా సమయాన్ని బట్టి అన్నీ అణిచేసుకున్నారు. ఒక విధంగా దానికి కారణం వారి ఆర్థిక స్థితే. కట్నాల బాధతో సుశీలకి పెళ్ళి కాక రెండేళ్ళ నుండి ప్రయత్నిస్తున్నా ఎక్కడా కుదరలేదు. సుశీల బాగానే వుంటుంది. అద్భుత సౌందర్యం కాకపోయినా సంసార పక్షంగా హుందాగా వుంటుంది.

రాత్రి తొమ్మిది దాటింది. మాధవరావు ఒక్కడూ గదిలో కూర్చున్నాడు. అది అతనికి మొదటిరాత్రి కాదు. కాని సుశీలకి మొదటిరాత్రి. అతని మస్తిష్కంలో తల్లి మాటలు చెవిలో గింగురు మంటున్నాయి.

"ఒరే చిట్టి ! జరిగింది. మరచిపోవాలిరా నాయనా ! చిన్నవాడవు. ముందర ఎంతో జీవితం వుంది. దాన్ని తల్చుకుని కుమిలిపోతే వచ్చేదేముంది ; బాధ తప్ప - ఇదిగో అటు ముఖం తిప్పుకుంటే కాదు. మరిక దాని మాట తలపెట్టకు, మనది కాని వస్తువు మనకి దక్కలేదు. అంతే" అంటూ హితబోధ చేసింది.

రాజ్యంకూడా పెద్ద ఆరిందాలా వచ్చి "చిట్టన్నయ్యా! ఈ వదిన కూడ మంచిదేరా - ఒరే నువ్వస్తమానం ఆవిణ్ణి గురించి మాట్లాడుతూ, తల్చుకుంటూ కూర్చుంటే మాత్రం బాధపడిపోతుంది. ఇందులో నువ్వు చేసిందేమీ లేదు. అలాంటి దేమీ పెట్టుకోకు. సుఖంగా కులాసాగా వుండి సుశీలను సుఖపెట్టు" అంది. ఆమె నోట్లో నుంచి అలాంటి పెద్ద పెద్ద మాటలు విని ఆశ్చర్యపోయాడు మాధవరావు అప్పట్లో. కాని పరిస్థితులు మనుష్యులకి ఎంతో పెద్దరికాన్ని తెచ్చి పెడతాయి అనిపించింది.

సుశీల మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ గదిలోకి వచ్చింది. మాధవరావు ఆమెని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. అలా చూస్తూంటే ఆమె ఒక చిన్నపిల్లలా తనొక వయసు మళ్ళినవాడినా అనిపించిందొకక్షణం. అంతలో అతనిలోని నిరాశని, నిర్లిప్తతని పారతోలేశాడు. అతని పెదవుల మీదకి చిరునవ్వు వచ్చి నిలిచింది. అతను చనువుగా లేచి 'రా సుశీలా' అంటూ ఆమెను ఆప్యాయంగా దగ్గరకి తీసుకున్నాడు. సుశీల తత్తరపడింది. అతని ముఖంలోకి

పరీక్షగా చూసింది. అతను మళ్ళీ నవ్వాడు. ఆమెకి ఎక్కడో కలుక్కుమంది. కాని పైకి కనబడనీయకుండా తల వంచుకుంది. సుశీల మనసు నిజానికి ఇలాంటి ప్రశాంత వాతావరణానికి సిద్ధపడి లేదు. అతను మామూలుగా ఏవేవో కబుర్లు చెప్పాడు. ఎంతో ఉత్సాహంగా నవ్విస్తూ కవ్విస్తూ గడిపేశాడు.

* * *

గదిలో గోడకి వ్రేలాడుతున్న సువర్చల ఫోటో కేసి చూశాడు మాధవరావు. అతని కేదోలా అనిపించింది. మెల్లగా దానికున్న దండ తీసేసి, ఆ ఫోటో పెట్లో అడుగున పెట్టేశాడు. ఇంతలో "అదేవిఁటిరా! ఆ ఫోటో తీస్తావూ" అంటూ సాగదీసింది తల్లి.

"ఎందుకది? అస్తమానూ చూస్తూ బాధ పడటానికి!" అన్నాడు.

"అయ్యో చోద్యంగా వుందిరా నాయనా" అంటూ బుగ్గలు నొక్కుకుంది, మాధవరావు యీలవేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. సాయంత్రం యింటికి రాగానే "సుశీలా! త్వరగా తెమిలిరా. సినిమాకి వెళదాం" అన్నాడు ఆమె ముఖం కోడిగుడ్డులాంపులా అయిపోయింది. ఎందుకో అతనికి అర్థం కాలేదు. ఏదో అత్తా కోడళ్ళు గొడవ పడ్డారేమో-, అడిగితే ఏం గొడవ వస్తుందో చావాలి, అని పట్టించుకోకుండా హడావుడిగా బాత్ రూమ్ వైపు నడిచాడు.

సినిమా చూస్తున్నంతసేపు అతని మనసు ఏలాగో అయిపోయింది. అందులో హీరో ఒక అమ్మాయిని ప్రేమిస్తాడు. మరొక అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. ఆ విషయం ఆ భార్యకి తెలుస్తుంది. అతనికే విధమైన బాధ వచ్చినా ప్రేయసి గురించి ఆలోచనగా భావించి అస్తమానూ అతన్ని దెప్పిపొడుస్తూ మాటలతో బాధిస్తూ వుంటుంది. అది చూస్తుంటే మాధవరావుకి మనసు మరీ వికలాంగా అయిపోయింది.

మర్చిపోవడం ఒక్కొక్క సమయంలో ఎంతో అవసరం అనుకున్నాడు. ఇష్టం వున్నా లేకపోయినా యిది బ్రతకటానికి మార్గం అని పదే పదే అనుకుంటూ వుండగానే సినిమా అయిపోయింది. లైట్లు వెలగగానే ఏడ్చి ఏడ్చి వాచిన సుశీల కళ్ళు చూసి ఆశ్చర్యపోయాడు. అందులో ఏడ్వవలసిన విషయం అతనికి ఎంత ఆలోచించినా కనబడటం లేదు. ఒకటి మాత్రం అనిపించింది. అంతకు మించిన విషాదం జీవితంలో వున్నవాళ్ళకి సినిమాలో యిలాంటి చిన్న చిన్న కష్టాలకి ఏడుపురాదు అనిపించింది. నవ్వుకున్నాడు. అతని నవ్వు సుశీల చూసింది. ఆమెకి వొళ్ళుమండిపోయింది. ఆమె ముఖం కోపంతో ఎర్రగా అయిపోయింది.

“పాపం, ఏడ్చావా!” అన్నాడు నవ్వుతూ. ఆ నవ్వుల్లో వుడికించడం వుంది.

"అవును, మీ లాంటి కఠినాత్ములకేం అర్థమవుతుంది లెండి!" అంది. అతను నిర్ఘాంతపోయాడు. అలా ఎందుకందో అతనికి అర్థంకాలేదు కాని అదే పట్టుకుని సాగలాగడం ఇష్టం లేక ఊరుకున్నాడు. తను వుడికించబోయాడు. ఆమె నిజంగా ఉద్రేకపడింది, అని సరిపెట్టేసుకున్నాడు రాత్రి పదిగంటలకి తలుపు తీస్తూ తల్లి విసుక్కోవడం అతనికి వినిపించింది. "ఏవిటో తిరుగుళ్ళు? కొత్తగా పెళ్ళయిన వాళ్ళకి మల్లే — ఎవరైనా చూసినా బాగుండదు" అంటూ. మాధవరావు మళ్ళీ ఆలోచించాడు. అతనికి అంతు పట్టలేదు. తనేమంటే మళ్ళీ ఆమె ఏమంటుందో—మధ్యలో సుశీల ఏమైనా బాధ పడుతుందేమోనని వూరుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

మాధవరావు ఆఫీసునుండి వచ్చేసరికి యిల్లు నిశ్శబ్దంగా వుంది. అతను అలసటగా లోపలికి వచ్చి నాలుగు వైపులా చూశాడు. ఎవ్వరూ లేరు. దూరంగా నూతిపళ్ళెం దగ్గర తల్లి గొంతు వినిపిస్తోంది. సరాసరి అటు వెళ్ళాడు. తల్లి రాయిమీద కూర్చుని పనిమనిషితో ఏవో పిచ్చాపాటీ కబుర్లాడుతోంది.

"పోయినవాళ్ళు పోతే వాళ్ళతోనే పోతాయి అన్నీ" అంటోంది తల్లి.

"ఏవిటో నందమ్మగారూ! అంతా గుర్తు చేసుకుంటూ బాధపడతారనుకుంటాం, కాని - పోయినోళ్ళతోనే అన్నీ పోతాయి నిజమేనండి" అంటూ అంట్లు బరాబరా తోమేస్తోంది.

"చిత్రమే మంగి, మా చిట్టిగాడుచూడు, అసలు వాడు మళ్ళీ మామూలు మనిషి అవుతాడా అనుకున్నాను. కాని ఈ రోజు ఈ సుశీలేగాని సువర్చలని ఒక్క మాటకైనా తలపెడితే ఒట్టు; చెప్పుకుంటే సిగ్గు. ఆ పిల్ల ఫోటో కూడా తీసి పారేశాడు. మగాళ్ళంతా అంతే! ఉన్నంతసేపు మనిషి కోసం పడి చస్తారు. తీరా పోయాక వాళ్ళకేం పట్టదు.

మాధవరావు స్థాణువులా నిలబడిపోయాడు. అతని బుర్ర మొద్దుబారిపోయింది. "అమ్మేనా యీ మాట్లాడేది అనిపించింది. కాని - కాని ఆ నాడు మర్చిపొమ్మని శత విధాల చెప్పింది కూడ అమ్మే. అతను మరింక అక్కడ నిలబడలేదు. ముందు గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. ఇంతలో గలగలమని నవ్వుకుంటూ సుశీలా, రాజ్యం ఇంట్లో అడుగుపెట్టారు. నవ్వుతున్న సుశీలని చూడగానే అతనికి ఏదో స్ఫురించింది. తనే సర్వస్వం అని నమ్మిన సుశీలకి బాధ కలిగించకూడదు. ఆమె ఆనందంగా వుండాలంటే సువర్చల తనకి గుర్తు రాకూడదు. గుర్తుకొస్తే తను మామూలు మనిషి కాలేదు. మర్చిపోవాలి - పూర్తిగా మర్చిపోవాలి. అతను ఆలోచనల నుండి తేరుకోనేలోగా రాజ్యం-

"చిట్టన్నయ్యా శనగలు ఇవిగోరా" అంటూ వచ్చి శనగలు యిన్ని చేతిలో పోసింది. అతని దృష్టి ఆమె మాటల మీద లేదు. ఆమె కట్టుకున్న చీరమీద పడింది. అవును ? అది సువర్చలది. అది రాజ్యం ఎందుకు కట్టుకుంది ! ఆ చీరని చూస్తే సువర్చల తన మనసులోకి వచ్చి కూర్చుంది. అందుకే ఎప్పుడూ సుశీలని కూడ కట్టుకోనివ్వడు. అతనికి చర్రున కోపం వచ్చింది. అసలు తనతో చెప్పకుండా రాజ్యం స్వతంత్రించి అలా కట్టుకోవడం అతనికి చాలా బాధగా అనిపించింది.

"ఏమే రాజ్యం ఆ చీర ఎందుకు తీశావు ?" అన్నాడు తీక్షణంగా.

"ఏం ? తీస్తే తప్పా. వుత్తినే బీరువాలో పడి వుంది కదా అని పేరంటానికి కట్టుకున్నాను" అంది ధీమాగా.

"చాల్లే అఘోరించావు. మరెప్పుడూ ముట్టుకోకు. ఈ చీరలు ఎవ్వరూ కట్టుకోని యింట్లో తిరగడం నా కిష్టం లేదు" అన్నాడు.

"అవునులే, వదిన వున్నంత కాలం కొంగు పట్టుకొని తిరిగావు. తీరా వచ్చిపోయాక ఆవిడ చీర చూస్తె అసహ్యం, ఆమె ఫోటో కనబడితే బాధ. ఆవిడ పేరెత్తితేనే చిరాకు - ఛీ - ఈ మగాళ్ళంతా యింతే" విసురుగా అంది.

"ఛీ ! నోర్మూయ్. యిష్టం వచ్చినట్లు వాగుతున్నావ్" అన్నాడు కోపం ఆపుకోలేక -

"నోరు మూసుకుని మీ యింట్లో పడుండాల్సిన పని నాకేమీ లేదు. ఈ పూటే వెళ్ళిపోతా" అంటూ విసవిసా వెళ్ళిపోయింది. మాధవరావు తలకాయ చేతులతో గట్టిగా నొక్కుకుంటూ కూర్చున్నాడు. "తొలకరి వలపులు చిలికించి జీవితానికి అర్థం చెప్పిన నిన్నెలా మర్చిపోగలను సువర్చలా" అంటూ మూగగా రోదించాడు.

మంచినీళ్ళు పట్టుకుని గదిలోకి వచ్చింది సుశీల. నీళ్ళ మరచెంబు టేబుల్ మీద పెట్టి, వక్కపొడి తీసుకుని నోట్లో వేసుకొని భర్తకి కూడ అందించబోయి ఆగిపోయింది. మాధవరావు పరీక్షగా సుశీలనే చూస్తున్నాడు. ఆమె నాలుగు నెలల్లో చాల మారింది. కొంచెం ఒళ్ళు వచ్చింది. తెల్లని శరీరం మరింత అందంగా మిసమిసలాడుతోంది. అతనికి ఆ మార్పు ఈ రోజే గుర్తించినట్లు వుంది. అందుకే అలా చూస్తూ వుండిపోయాడు.

'ఇదిగో - ఏమిటలా చూస్తున్నారూ' అంది గోముగా.

"ఆ .... నువ్వెంత బాగున్నావో తెలుసా" అన్నాడు ఆమె చేతిని తన చెంపకి అనించుకుని.

"నిజంగానా !"

"నిజం. అవునూ ఒక్కటి అడగనా ?

"అడగండి!"

"ఇంత అందం నీకెలా వచ్చింది ? మత్తుగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"చెప్పనా"

అతను రెండు చేతులూ ఆమె నడుం చుట్టూ వేసి మరీ దగ్గరికి తీసుకుని "ఊ" అన్నాడు.

ఆమె అతని చెవిలో మెల్లగా చెప్పింది. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"కాని నాకు భయంగా వుందండి."

"ఎందుకూ?"

అతని కేసి నిశితంగా చూస్తూ "చచ్చిపోతానేమోనని" అంది.

అతను ఉలిక్కి పడ్డాడు. చంటిపిల్లాడిలా విలవిల్లాడి పోయాడు.

"సుశీలా - నువ్వు లేకపోతే నే నుండగలనా, చచ్చి పోనూ" అన్నాడు ఆందోళనగా.

"మీరా" ఆమె గొంతులో హేళన, అసహ్యం, నిరసన ముప్పిరిగొన్నాయి. ఆమెముఖం కోపంతో ఎర్రబడింది. ఒక్కసారి దీర్ఘంగా శ్వాసవదిలి "మీరు పోయిన వాళ్ళగురించి ఎంత బాగా గుర్తు పెట్టుకుంటారో నాకు బాగా తెలుసు. చచ్చిపోయిన వాళ్ళతో పోనక్కరలేదు గాని కనీసం తల్చుకోనైనా తల్చుకోరు.

అతను అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

"నాలుగు నెలలైంది నేనుయిక్కడికొచ్చి, ఒక్కరోజు, కనీసం ఒక్కసారైనా అక్కయ్యనిగురించిఒక్క మాట,అన్నారా

కనీసం తల్చుకున్నారా? వున్న్నాళ్ళూ ఎంతో ప్రేమగా వుండే వారట. మొదటి రాత్రి నాడే అనుకున్నా; మీరు నాతో అక్కయ్య గురించి ఎన్నో చెప్తారని. కాని ఒక్క మాట చెప్పలేదు. పైగా ఆమె గుర్తులు ఏమీ యీ ఇంట్లో కనిపించ కుండా చేశారు. అక్కయ్య కోసం ఒక్క కన్నీటి బొట్టు మీరు రాల్చారని నేననుకోను. అక్కయ్య చీరలు అలా బీరువాలో వుంటే వాటిని కనీసం కన్నెత్తి చూడలేదు. వాటిని నాకిచ్చి నన్ను కట్టుకోమని నాలో అక్కయ్యని చూసి మీరు తృప్తిగా బ్రతుకుతారని అనుకున్నా. కాని, మీకు అసలు అక్కయ్య గుర్తేలేదు. గుర్తు రాదుకూడా.

"సుశీలా -! ఏమిటి నువ్వు మాట్లాడేది ? నేను ఎవరి కోసం అలా చేశానో నీకు తెలియదూ" అన్నాడు బాధగా.

"ఎవరికోసమూ కాదు. మీ కోసం. అయినా ఒకరి కోసం మరొకర్ని మర్చిపోగలరా?"

మాధవరావు చూస్తూ వుండిపోయాడు ఒక్క క్షణం. తను మర్చిపోలేక పోయిన సువర్చలని వీళ్ళందరూ మర్చిపొమ్మని చెప్పారు. తను మర్చిపోలేక పోతానేమోనని ఆరు నెలలు తిరక్కుండా పెళ్ళిచేశారు. తీరా తను నిగ్రహించు కుంటుంటే యిదేమిటి ? చివరికి సుశీల కూడా యింతేనా - ఎవరైతే తనని జీవితంలో రాజీపడమన్నారో వాళ్ళే తన్నెం దుకు హింసిస్తున్నారు ! మాధవరావు బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

("స్వాతి" మాస పత్రికనుండి)